# ప్రేమ సామ్రాజ్యం



పులాపు బాలకేశవులు

**పక్క మీద పడుకుని వున్న రేఖ నిద్రలోనే ప్రక్కకు చేయి జాపి చూస్తే, తన పక్కన పడుకున్న భర్త వున్నట్లు అనిపించక పోవడంతో కళ్ళు తెరచి చూసింది. ఆమె దృష్టి ఆ గదిలోని గోడ గడియారం వేపు మళ్ళింది.**

రాత్రి రెండు గంటల సమయం భర్త పక్క మీద లేకపోవడంతో కంగారుగా లేచి వరం డాలోకొచ్చిందామె. చేతులు వెనక్కి పెట్టుకుని వరం డాలో అటూ ఇటూ పచార్లు చేస్తున్న భర్త మాధవ రావు కనిపించాడు. భర్త ముఖం చూస్తూనే అతనేదో తీవ్రమైన ఆలోచనతో సతమత మౌతు న్నాడని ఇట్టే గ్రహించిందామె. అతని చేతిని పట్టు కుని నడిపించుకెళ్తుంటే ఆమె వెనుక రథంలాగా నడిచి వచ్చి పక్క మీద కూర్చున్నాడు. ఒక గ్లాసు చల్లని మంచినీళ్ళు తాగించిన తర్వాత మళ్ళీ ఈ లోకంలోకి వచ్చి పడ్డాడు.

"ఏమిటండీ! ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు న్నారు. ఏమయిందో నాకు చెప్పకూడదూ?" అతని గడ్డాన్ని చూపుడు వెలు బొటన వెళ్ళతో స్పృశిస్తూ అందామె. "ఇంక పది రోజులు మాత్రం మిగిలు న్నాయి రేఖా. ఏదీ నిశ్చయం కాలేదు. నమ్మినవాళ్ళే మోసం చేస్తున్నారు. ముఖం చూపించలేని పరిస్థితి ఏం చేయాలో అర్థం కావటం లేదు."

రేఖకు భర్త మాటల అర్థం తెలియలేదు. తన భర్త ఉత్తమ నాటక రచయిత. అతను రాసిన నాలుగైదు నాటకాలు అచ్చయ్యాయి కూడా. అవి అందరూ మెచ్చుకొనే రీతిలో రంగస్థలంపై ప్రదర్శింపబడ్డాయి. మరో పది రోజుల్లో అతను

రాసిన, ప్రేమసామ్రాజ్యం ప్రదర్శించవలసి వుంది. అతను రాసిన నాటకాలలో ప్రేమసామ్రాజ్యం ఉత్తమమైనదని ఒప్పుకుని, దాన్ని ఎన్నోసార్లు చదివి, తన భర్తతో అదే విషయం చెప్పి అతన్ని ప్రోత్సహించిందామె. ఈ కొత్త నాటకం రిహార్సల్స్‌లో పడి, రాత్రి పన్నెండు గంటలకు ఇంటికి వచ్చినా ఏమీ అనలేదు. నాటకం విజయవంతమవ్వాలనీ తన భర్తకు, ఉత్తమ రచయిత బహుమతి రావాలనీ ఆమె ఆకాంక్ష. రేఖ విద్యావంతురాలు. సాహిత్యమంటే మంచి అభిరుచి గలది. తన భర్తతో సాహిత్యం గురించి చర్చిస్తుంటే ఆమెకు అమితమైన ఆనందం కలిగేది. దానికి తోడు రేఖ మంచి రూపవతి. ఆమెను మాధవరావు మొదటి చూపులోనే ఇష్టపడి స్వీకరించటానికి ఆమె అందమైన చిరునవ్వే కారణం.

పండితుడైన శ్రీనివాసరావు ముద్దుల కూతురై పెరిగిన రేఖ తండ్రికున్న అపారమైన జ్ఞానంలోంచి కొద్దిగా పుణికిపుచ్చుకుంది. మాధవరావు జీవితంలో ఆమె ఉత్త భార్యగానే కాక, అతని రచనలను గురించి చర్చించే మిత్రురాలిగానూ జలుబు, జ్వరంలాంటి చిన్నచిన్న అస్వస్థతలకు వనమూలికల నుంచి, ఆకుల నుంచీ రసం, పసరులాంటివి తయారుచేసి, అతనికి చికిత్స చేసే డాక్టరుగానూ ప్రవేశించింది. రేఖ సాంగత్యంలో మాధవరావు అత్యంత సుఖతరమైన జీవనం సాగిస్తున్నాడు. అతని ప్రేమసామ్రాజ్యం నాటకం ప్రదర్శనకు కేవలం పది రోజులు మాత్రమే టైముందనగా అతనికి ఏం అస్వస్థత కలిగిందో అని కంగారు పడిందామె. జ్వరం వచ్చిందేమోనని నుదుటిపై అర చేతితో స్పృశించి చూసింది. అలాంటిదేం ఉన్నట్టు అనిపించలేదు. ఒంట్లో వేడి చేసి నిద్ర పట్టడం లేదేమోనని, ఏదైనా ఔషధం తయారుచేసి తెద్దామని వంటింట్లోకి వెళ్ళబోతున్న ఆమెను మాధవరావు చేయి పట్టుకుని ఆపాడు.

"నాకేం అవలేదు రేఖా! బాగానే ఉన్నాను. ప్రేమ సామ్రాజ్యం నాటక ప్రదర్శనకు ఇంకా పది రోజులు మాత్రమే టైము మిగులుందన్న సంగతి నీకు తెలుసు. ప్రభుత్వ నాటక మహోత్సవాలలో మొదటిసారిగా పాల్గొనబోతుంటే, ఇప్పుడే ఆ ఇబ్బంది రావాలా? పైగా ముఖ్యమంత్రిగారు ఈ సమారంభానికి ముఖ్య అతిథి. ఉన్న అన్ని నాటకాలలో నా నాటకానికే ఈసారి ప్రథమ బహుమతి రావటం ఖచ్చితమని రిహార్సల్స్ చూసిన మిత్రులు చాలామంది చెప్పారు. ఎందుకో నాకూ అలాగే అనిపిస్తోంది. అయితే"

"అయితే ఏమయిందండీ! ఇంతగా ఎందుకు బాధపడుతున్నారు? నాటక రచయిత, దర్శకుడు మీరే అయ్యుండి మీరే ఇలా నిరుత్సాహపడితే మిగిలిన నటీనటుల గతి ఏమిటండీ? వాళ్ళకు ప్రోత్సాహం ఎవరిస్తారు? మీరే చెప్పండి." భర్త చేయి పట్టి కుదుపుతూ అందామె.

"రేఖా! అంతా బాగానే ఉంది. నాటకం నువ్వూ చదివావు. రాత్రింబగళ్ళు నిద్రాహారాలు మాని ఈ నాటకం రాశాను. ఈ నా నాటకం రంగస్థలంపై నవచైతన్యం కలుగ చేస్తుందని అనుకుంటుండగా ఇలా జరుగుతుం దనుకోలేదు."

"హీరో మోసం చేశాడా?"

"హీరో కాదు రేఖా! అతడి గురించి ఏ విధమైన చింతా లేదు. గత నాటకం ప్రేమ పాశంలో ముఖ్యపాత్ర పోషించిన దివాకర్ ఈ నాటకంలో హీరో. నేను చిత్రించినంత అందంగానే ఉన్నాడు. మంచి అభినయం కనబరుస్తున్నాడు. కానీ హీరోయిన్ పాత్ర పోషించే చంద్రలేఖ ముంచేసింది. నిన్నటి వరకూ పాత్ర కంఠస్థం చేసి, రిహార్సల్స్‌కు వస్తూ, మంచి అభినయం కనబరుస్తూండేది. అయితే ఈ రోజు రిహార్సల్స్‌కు రావటానికి బదులు ఓ చీటీలో, మా వారు ఈ నాటకంలో నటించవద్దని చెప్పారు. మీకు ఇబ్బంది కలిగిస్తునందుకు క్షమించండి అంటూ రెండు ముక్కలు రాసి పంపించింది. పెద్ద సమస్యే తెచ్చిపెట్టిందా అమ్మాయి. వేరే ఎవరినైనా ఆ పాత్రకు తీసుకున్నామనుకో, ఆ పాత్రకున్న నలభై పేజీల సంభాషణలను ఇంత తక్కువ టైములో కంఠస్థం చేయించటం సాధ్యమయ్యే పనేనా? సగం సగం నేర్చుకుని నటిస్తే నాటకం విజయవంతం ఎలా అవుతుంది? ప్రైజ్ ఎలా వస్తుంది?" మనసులోని బాధను రేఖకు చెప్పుకున్నా అతని చిరాకు ఎక్కువయిందే తప్ప తగ్గలేదు.

"అయితే మరి ఏం చేద్దామనుకుంటున్నారు? నాటకం ప్రదర్శించటం మానేద్దామను కుంటున్నారా?" ఆదుర్దాగా అడిగిందామె.

"ఏం చేయాలో అర్థం కావటం లేదు రేఖా! పడ్డ శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరు అయ్యేట్టుంది." బాధగా అన్నాడు మాధవరావు.

"చంద్రలేఖ రాకపోతే ఏం ఆమె కంటే నేను ఆ పాత్రను బాగా పోషించి, ఆ నాటకం విజయవంతమయ్యేట్టు చేయగలను..." అనాలనుకుంది. కానీ అనలేకపోయిందామె. దానికీ కారణం వుంది.

మాధవరావు ఉత్తమ నాటకం రచయితే కాక ఉత్తమ కళాకారుడన్నది నిజం. ఆంధ్ర రంగస్థలాన్ని ప్రగతిలోకి నడిపించాలని అతని ఉద్దేశ్యం. పెళ్ళి అయిన మొదట్లో రేఖను ఏదో నాటకం రిహార్సల్స్‌కు తీసుకెళ్ళాడు. నాటకంలో నటించే నటీనటులను కాకుండా రిహార్సల్స్‌కు వచ్చిన జనం అంతా తన రేఖనే చూస్తున్నారని గమనించిన అతను, ఆ తరువాత నుంచీ ఆమెను రిహార్సల్స్‌కు తనతో తీసుకెళ్ళటం మానేవాడు. నాటక ప్రదర్శనకు హాజరవటంలోనే రేఖ తృప్తి చెందేది. మాధవరావు తన మనసులోని భావాలను భార్య ముందు వ్యక్తపరిచేటంతటి మూర్ఖుడేం కాదు. అయితే సూక్ష్మగ్రాహి అయిన రేఖ అతని సంకుచిత భావాన్ని ఇట్టే అర్థం చేసుకుంది. స్త్రీ పాత్ర కోసం, ఇబ్బంది పడుతున్న భర్త ముందు తనే ఆ పాత్రను సమర్థవంతంగా పోషించగలనని చెప్పటానికి అసమర్థురాలయింది. భర్త దుఃఖాన్ని అనుభవించటం చూసిన రేఖ మళ్ళీ అదే ప్రశ్న అడిగింది.

"మరి ఏం చేద్దామనుకుంటున్నారు?"

"ఒక ఉపాయం మిగిలింది రేఖా! మహిళా అభ్యుదయ కేంద్రం వారు ఎల్లుండి ఏదో సభ ఏర్పాటు చేసుకున్నారు. ఆంధ్ర రంగస్థలం గురించి నాలుగు మాటలు మాట్లాడమని నన్ను ఆహ్వానించారు. స్త్రీ పాత్ర పోషణకు వెనుకంజ వేసే మహిళలే ఆంధ్ర రంగస్థల ప్రగతికి నిరోధంగా నిలుస్తున్నారని గట్టిగా మాట్లాడి, ఆంధ్ర వనితలు రంగస్థలం పైకి కాలిడాలని మాట్లాడతాను. ఆ సభలోనే ప్రేమసామ్రాజ్యానికి నాయకిని వెతుక్కోవాలి.

రేఖకు భర్త ఉపాయం సుతరామూ నచ్చలేదు. అదే అడిగేసింది. "మీరు అలా మాట్లాడినంత మాత్రాన రంగస్థలంపై రంగు వేసుకుని గంతులేయటానికి ఎవరు తమ ఆడవాళ్ళను పంపుతారండీ? మర్యాద వదలి రంగస్థలంపై నటించడానికి ఏ తండ్రి తన పిల్లలను పంపు తాడు? ఏ భర్త తన భార్యను అనుమతిస్తాడు?"


పాలుకురికి సోమనాథుడు రచించిన

**'బసవ పురాణము'**




మోడరన్ టైప్ సెట్టింగ్‌లో, 1/8, డెమీ సైజులో
అందమైన బసవేశ్వరుని వర్ణచిత్రం ముఖచిత్రంగా
430 పేజీలతో వెలువడింది.
ముఖ్యంగా
దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి
ప్రస్తావనతో సర్వాంగ సుందరంగా ముద్రించిన
అపురూప పుస్తకం.
ఇంకా ఈ పుస్తకంలో బసవపురాణంతో బాటు
అనుభవ సారము, చతుర్వేద సారము, వృషాధిప శతకము,
చెన్నమల్లు సీసములు ప్రచురించడం జరిగింది.
అపురూపమైన ఈ పుస్తకం వెల రూ.125/- మాత్రమే.
ప్రతులకు :
**ఆంధ్ర ప్రచురణ ప్రైవేట్ లిమిటెడ్,**
103/1, లజ్ చర్చి రోడ్, మైలాపూర్, చెన్నై 600 004 కు వ్రాయండి.
రూ. 125/- ఎం.ఓ. చేసినవారికి పోస్టేజి ఖర్చులు భరించి పుస్తకం పంపించగలము.

నాటక రంగాన్ని ఉద్ధరించడానికి రాత్రింబగళ్ళు కష్టపడే మాధవరావు కోపం నషాళాని కంటింది. రేఖ అభిప్రాయాన్ని ఖండిస్తూ ఆమెపై విరుచుకుపడ్డాడు. రాత్రిళ్ళు నిద్రమాని నాటకాలు రాసి రాసి రిహార్సల్స్ చేసి క్షీణించిన దేహం కావటంతో, మాట్లాడుతూనే. ఖళ్‌ఖళ్ అంటూ దగ్గటం మొదలెట్టాడు. రేఖ వెంటనే వంటి గదిలోకి పరుగు తీసి, ఏదో కషాయం తయారుచేసి తీసుకు వచ్చి, భర్త చేత తాగించి, పక్క సరిచేసి అతన్ని పడుకోబెట్టింది. మాధవరావు పది నిముషాలలో నిద్రలోకి జారిపోయాడు. నాలుగుసార్లు గురక పెట్టిన తర్వాత గమనించి చూస్తే అతని పెదవులు కదులుతున్నాయి. అతని పెదవులకు చెవి ఆనించి విన్న రేఖ ఆశ్చర్యపోయింది. అతని పెదవులు స్త్రీ పాత్ర స్త్రీ పాత్ర అంటూ కలవరించటమే దానికి కారణం.

❋ ❋ ❋

"అధ్యక్షా! సోదరీమణులారా!

ఆంధ్ర రంగస్థలం గురించి మాట్లాడటానికి మీరు నన్ను ఆహ్వానించారు. మరి నేనీ గౌరవానికి ఎంతవరకూ అర్హుడనో! అయితే గడిచిన పదిహేను సంవత్సరాలుగా ఆంధ్ర రంగస్థలానికి సేవ చేస్తూ వచ్చాను. ఆంధ్ర రంగస్థలం గురించి అహర్నిశలూ శ్రమించిన ఎంతోమంది మహనీయులున్నారు. వారి ముందు నేనెంతటివాడిని. రజతోత్సవాలు, సువర్ణ మహోత్సవాలు జరుపుకుని, వందల కొలది నాటకాలను ఆంధ్ర రంగస్థలంపై సజీవంగా ప్రదర్శించిన నాటక సంస్థలున్నాయి. అయితే ఇంత చేసిన తర్వాత కూడా మన రంగస్థలం ఎంతవరకు ప్రగతి సాగించిందీ అన్నది సుదీర్ఘంగా చర్చించాల్సి వుంది. 35-40 సంవత్సరాల క్రితం ఈ మహానగరంలో తమ నాటకాలలో స్త్రీ పాత్రలను పురుషులే అభినయిస్తూ ఉండేవారు. అయితే ఈనాడు కూడా మీసం మొలిచిన మగాడే శకుంతల వేషం వేసుకుని దుష్యంతుడిని మోహిస్తుంటే, తలపై విగ్ ధరించి దానిపై వెన్నకుండ పెట్టుకుని, విగ్ ఎక్కడ జారిపోతుందో, వెన్నకుండ ఎక్కడ పడిపోతుందో అన్న కంగారులో డైలాగులు మరచిన మగాడు రాధగా శ్రీకృష్ణునితో రాసక్రీడలాడుతున్నట్టు నటిస్తుంటే మన ఆంధ్ర రంగస్థలం ఎలా బాగుపడుతుంది మీరే చెప్పండి.

స్త్రీ పాత్ర పోషించడానికి సిద్ధ పడే మహిళల కొరతే ఆంధ్ర రంగస్థల ప్రగతికి అడ్డుగోడ. స్త్రీలు పరదాల వెనుక ముఖం చాటు వేసుకొని ఉండే కాలం పోయింది. ఆంధ్ర వనితలు కన్ను తెరిచే సమయం వచ్చింది. ఈనాటి నాటక రచయితగా కోరుతున్నాను, పాశ్చాత్యదేశాలు ఈ విషయంలో ఎంతో ముందున్నాయి. పురుషులలాగే స్త్రీలకూ సమానాధికారాలు వచ్చాయి. స్త్రీ పాత్రను పురుషులు పోషించటమంటే తమ రంగస్థలానికి అవమానంగా భావిస్తారు వాళ్ళు. ఒక్క పాశ్చాత్య దేశాలే ఏమిటి? గుజరాతీ, మరాఠీ, కన్నడ రంగస్థలాల ఉన్నత పరిస్థితి వైపు మన ఆంధ్ర వనితలు దృష్టి మరల్చి ముందుకు రావాలి. ఆంధ్ర పురుషులు సీతగా, సత్యభామగా, రుక్మిణిగా, మండోదరిగా రంగస్థలపై నటిస్తుంటే ఎంతగా రంగు పూసుకున్నా, పెదాలపై నున్న నల్లని మీసపు ఛాయలు, కంఠస్వరం వారు స్త్రీలు కాదన్న విషయాన్ని చెప్పకనే చెబుతాయి. మన రంగస్థలం మన్నుపాలయిపోతోంది. మన సంస్కృతి తల దించుకునే రోజొస్తోంది. సోదరీమణులారా! మన ఆంధ్ర రంగస్థలపు భవిష్యత్తును పరిరక్షించి, పాలించే అతిపెద్ద బాధ్యత మీ చేతుల్లో ఉంది."

మహిళా అభ్యుదయ కేంద్రపు సభలో నాటక కారుడు మాధవరావు ఇలా సుదీర్ఘమైన ఉపన్యాసాన్నిచ్చి ఆంధ్ర రంగస్థలపు అధఃపతనాన్ని గుర్తుకు తెచ్చుకొని బాధపడుతూ కళ్ళ వెంబడి నీళ్ళు కార్చాడు. సభలో చప్పట్లు మార్మోగాయి.

❋ ❋ ❋

ఆంధ్ర రంగస్థలాన్ని ఉద్ధరించమని మాధవరావు ఇచ్చిన పిలుపుకు స్పందించి ఎవరూ ముందుకు రాలేదు. నాటక మహోత్సవానికి మూడు రోజులు మాత్రమే టైము మిగిలి వుంది. మాధవరావుకు మానసిక రోగం పట్టుకుంది. ప్రేమ సామ్రాజ్యం, నాటకానికి రచయితా, దర్శకుడూ సర్వస్వం అతనే అయినప్పుడు అతని పరిస్థితి చింతాజనకంగా ఉండటంతో ఆశ్చర్యం ఏముంది గనక! నాటకం ప్రదర్శించటమా! మానుకోవటమా! అని అంతిమ నిర్ణయం తీసుకోవాల్సిన రోజది. మాధవరావు మానసిక పరిస్థితి పూర్తిగా చెడిపోయింది. నీలకంఠాచారి భార్య తారామతి డబ్బీ వీరన్న కంపెనీలో మంచి పేరున్న తార. నాటక కళ అంటే ఆమెకు ఆరో ప్రాణం. తారామతి నుంచి కళను లాగేసుకుంటే ఆమె ప్రాణం లాగేసుకున్నట్లే. ఒకే రోజులో సదారమ పాత్ర సంభాషణలను కంఠస్థం చేసి విజయవంతంగా నటించి, ఉత్తమనటి బహుమతిని గెల్చుకున్న నటి అని ఆమెను అందరూ చిలవలు పలవలుగా వర్ణించి చెప్తుంటే అతనిలో చిన్న ఆశ చిగురించింది మళ్ళీ. ఆమె ఫలానాచోట ఉంటున్నదని ఎవరో చెప్పారు.

తారామతి చిరునామా తీసుకుని - తీరా అక్కడికెళితే నిరాశే ఎదురయిందతనికి. బంధువులు ఎవరికో జబ్బు చేస్తే చూసి రావటానికి నాలుగురోజుల క్రితమే తిరుపతి వెళ్ళిందట ఆమె. నిరాశతో వెనుదిరిగాడు అతను.

నాటకంలోని ఇతర పాత్రధారులు నాటక ప్రదర్శన విషయమై అంతిమ నిర్ణయం కొరకు రిహార్సల్ హాల్‌లో కలుసుకోవాల్సిన రోజు అది. మాధవరావు ఇంటికెళ్ళకుండానే, నేరుగా రిహార్సల్ హాల్‌కు వచ్చాడు భారంగా అడుగులేసుకుంటూ ఆ ఇంటి మెట్లెక్కుతున్నాడు. మూడో అంతస్థులో రిహార్సల్ జోరుగా నడుస్తున్నట్టు సంభాషణలు వినబడుతున్నాయి. ప్రేమసామ్రాజ్యం, కథానాయ కుడు సంభాషణలను ఎంతో ఉత్సాహంగా మెచ్చే రీతిలో చెప్పుకుపోతున్నాడు. తాను సృష్టించిన సుందర సంభాషణలు, మెట్లెక్కి పైకొస్తూ ఉన్న మాధవరావు చెవులను తాకాయి. కథానాయకుడు ప్రేమగా మాట్లాడే సంభాషణకు, ప్రత్యుత్తరంగా కథానాయకి మధురమైన మాటలు వినిపిస్తునాయి. సంతోషం, ఆశ్చర్యం ఒకే సమయంలో అను భవిస్తూ, మెట్లెక్కి వచ్చి గుమ్మం దగ్గర నుంచున్నా డతను. సుందరమైన ఆ దృశ్యపు రిహార్సల్ బ్రహ్మాండంగా నడుస్తోంది. కథానాయకుడు దివాకర్, కథానాయకి మధుమతి పాత్రధారిణి రేఖ ఎర్రని బుగ్గలను స్పృశిస్తూ, ప్రేమగా దగ్గరకు లాక్కుని, ఆమె తలలో గులాబి పువ్వు తురుముతున్నట్టు నటిస్తూ, ప్రేమ సామ్రాజ్యం, నాటకంలోని ఓ దృశ్యానికి జీవం పోస్తున్నాడు. అయితే మాధవరావుకు మాత్రం ప్రాణం దేహాన్ని విడిచిపోతున్న భావన కలిగింది. నాటక రచయిత దర్శకుడు ఆంధ్ర రంగ భూమిని ఉద్ధరించాలని రాత్రింబగళ్ళు శ్రమించే మాధవరావుకు కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది. నుంచున్నవాడు నుంచున్నట్టే స్పృహ తప్పి పడిపోయాడు. అతని భార్య రేఖ పరుగెత్తుకుంటూ వచ్చి పతిదేవుని తల, తన ఒడిలో పెట్టుకుని ఏదో ఔషధం తెమ్మని ఎవరినో ఆదేశించింది. తన భర్త ఏ రోగానికి ఎలాంటి మందేయాలో ఆమెకు బాగా తెలుసు కదా! ఆ దృశ్యం చూసిన ఎవరో గట్టిగా అరిచారు మన తర్వాతి నాటకం సతీసావిత్రి అని. ❋

